కేసీఆర్ ఆశీర్వాదం

తన జన్మదినం సందర్భంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్న తెలంగాణ రెడ్కో మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై.సతీశ్ రెడ్డి

– ఎల్బీనగర్, ఆగస్టు 25

ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ కమిటీ

నగర అధ్యక్షుడిగా ఎస్.అశోక్

ప్రధాన కార్యదర్శి జంగయ్య,

హిమాయత్‌నగర్, ఆగస్టు 25: తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ హైదరాబాద్ జిల్లా నూతన కమిటీ ఎన్నికైంది. నగర అధ్యక్షుడిగా ఎస్.అశోక్, నగర ప్రధాన కార్యదర్శి సీహెచ్ జంగయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఏ.బిక్షపతి యాదవ్, ఉపాధ్యక్షులు ఎమ్డీ ఓమర్ ఖాన్, కె.బాబు, ఎమ్డీ ఖాజా, ఎమ్డీ సలీం, ఎమ్డీ జాకీర్, శంకర్ యాదవ్, ఎన్.శ్యామ్, ఉప ప్రధాన కార్యదర్శి జి.మల్లేశ్ గౌడ్, కోశాధికారి జి.ఇంద్రసేనాలతో పాటు 12 మంది సహాయ కార్యదర్శులు, 10 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికైనట్లు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం తెలిపారు. ఈ సందర్భంగా అశోక్, జంగయ్య మాట్లాడుతూ, పెరిగిన ధరలకు అనుగుణంగా ఆటో మీటరు చార్జీలను పెంచి, ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలయ్యేంత వరకు తాము బలమైన పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు.

రెసిడెన్షియల్ మార్కెట్‌లో హైదరాబాద్ టాప్-2

- అగ్ర స్థానంలో ఆర్థిక రాజధాని ముంబై
- నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 25(నమస్తే తెలంగాణ): భాగ్యనగరం మరో ఘనత సాధించింది. రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించి దేశంలోనే అత్యంత ఖరీదైన నగరాల్లో హైదరాబాద్ టాప్-2లో నిలిచింది. దేశ ఆర్థిక రాజధాని ముంబై మొదటి స్థానం ఆక్రమించింది. ఈ విషయం 'అఫర్డబిలిటీ ఇండెక్స్' పేరుతో 'నైట్ ఫ్రాంక్ ఇండియా' తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడైంది. ఇందులో అత్యంత ఖరీదైన రెసిడెన్షియల్ మార్కెట్లలో హైదరాబాద్ రెండోస్థానం దక్కించుకున్నది. హౌస్ ఈఎంఐ-ఆదాయ నిష్పత్తి ఆధారంగా దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాలను ఎంచుకోగా.., 2024 మొదటి అర్ధ భాగంలో 30 శాతంతో హైదరాబాద్ 2వ స్థానంలో నిలిచింది. 2023 నుంచి అదే స్థాయిని కొనసాగిస్తున్నది. 51 శాతం నిష్పత్తితో ముంబై మొదటి స్థానంలో నిలిచింది.

అహ్మదాబాద్‌లో తక్కువ ..

తొలి ఎనిమిది నగరాల్లో అహ్మదాబాద్ అత్యంత సరసమైన రెసిడెన్షియల్ మార్కెట్‌గా ఉన్నది. 21 శాతం నిష్పత్తితో పుణె, కోల్‌కత్తా 24 శాతం చొప్పున ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ముంబై స్థోమత పరిమితి 51 శాతం ఉన్న ఎక్కువగా ఉన్నది. ఎన్నో ఏండ్లుగా హైదరాబాద్ నగరం స్థోమత సూచిక గణనీయమైన మార్పులకు గురవుతున్నది. 2010లో ఈ నిష్పత్తి 47 శాతంగా ఉండగా, 2019 నాటికి 34 శాతానికి పడిపోయింది. 2020లో 31 శాతానికి తగ్గింది. 2021లో దాని కనిష్ఠ స్థాయి 28 శాతానికి చేరుకున్నది. ఆ తర్వాతి సంవత్సరాల్లో స్వల్ప పెరుగుదల కనిపించింది. 2022, 2023, 2024 ప్రథమార్ధంలో నిష్పత్తి 30 శాతం వద్ద స్థిరంగా నిలిచింది. 2010లో హైదరాబాద్‌లో చదరపు అడుగు వెయిటెడ్ సగటు ధర రూ.2,728గా ఉన్నదని, 2019లో రూ.4,500కి పెరిగిందని నివేదిక పేర్కొన్నది. 2024 మొదటి అర్ధ భాగం నాటికి ధరలు క్రమంగా రూ.5,681కి పెరిగాయి. 2019 నుంచి 26 శాతం పెరుగుదల, 2023 మొదటి అర్ధభాగంతో పోలిస్తే 5 శాతం పెరుగుదల కనిపించింది.

వయ్యారి భామను తరిమేద్దాం

పూత దశలోపే తొలగించేద్దాం

వర్సిటీ ప్రధాన శాస్త్రవేత్త డా.పద్మజ

వయ్యారి భామ మొక్కపై విద్యార్థులకు అవగాహన

వ్యవసాయ యూనివర్సిటీ, ఆగస్టు 25: అందంగా మన చుట్టూ కనిపించే ఈ కలుపు మొక్క వయ్యారి భామ (పార్థీనియ) చాలా ప్రమాదకరమైనది. విదేశం నుంచి దిగుమతై, దేశ సంపదను నాశనం చేస్తుంది. గ్రామీణ ప్రాంతాలలో వర్షాకాలంలో ప్రజలు ఎక్కువగా ఈ మొక్క నుంచే రోగాల బారిన పడుతున్నారని తేలింది. దీని ప్రభావం పాడీ పంటలతో పాటు, మనుష్యులపై దేశ వ్యాప్తంగా ప్రత్యక్ష, పరోక్షంగా వుంది. అమెరికా సంయుక్త రాష్ట్రాలకు చెందిన ఈ మొక్క మన దేశానికి 1950లో గోధుమల ద్వారా దిగుమతి అయ్యింది. ఇది అన్ని రకాల నేలల్లో ప్రధానంగా దక్షిణ భారత్ అంతా అనతి కాలంలోనే పాకింది. ఇది వ్యవసాయ పొలాలు, పొలం గట్టుతో పాటు ఖాళీ ప్రదేశాలలో విస్తారంగా పాకింది. ప్రస్తుతం, ఈ మొక్క దేశ వ్యాప్తంగా పూత దశలో ఉంది. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ మొదటి వారంలోపు తొలగించాలని, రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం కలుపు విభాగం ప్రధాన శాస్త్రవేత్తలు సూచించారు. ఇటీవల పార్థీనియ నివారణపై అవగాహన, వారోత్సవాల అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో ఎక్కువగా పార్థీనియ కలుపు మొక్కలు అధికంగా పెరిగాయని గుర్తు చేశారు. మూడ ముచ్చటగా, ముక్కుపుడకను పోలి ఉండే ఈ మొక్క పంటలకే కాకుండా, మనుష్యులు, పశువులకు హాని కల్గిస్తాయని తెలిపారు. ఇది పూత దశకు రాక ముందే నివారించాలని సూచించారు. జీవ నియంత్రణ, రసాయనిక పద్ధతులతో వీలైనంత త్వరగా తొలగించాలని తెలిపారు.

అపారనష్టం..

ఆయా పంటలలో 40 శాతం దిగుబడి తగ్గిస్తోంది. టమాట, వంగ, మొక్క జొన్న పుప్పొడిపై ఎక్కువగా ప్రభావం ఉంటుంది. ఇది నల్ల రేగడి పొలాల్లో మరీ వేపుగా పెరుగుతుంది. ఈ మొక్క వేర్ల నుంచి విషపూరిత రసాయనాలు వెదజల్లుతాయి. అక్షింతల చెట్టు, కుక్క సీరికె (అఫైరాన్‌ఫస్ అస్పర) అనే విలువైన మొక్క దంత, నోటి దుర్వాసన, సర్వరోగ నివారిణిని ఈ మొక్క పోలి ఉంటుంది. వయ్యారి భామ వల్ల మనుష్యులకు వాటి ఆకులను తగిలినా చర్మ సంబంధిత, తామర, వ్యాధులు, ఆ మొక్క వాసన పీల్చినా జలుబు, కండ్లు ఎర్రబడటం, కండ్ల రెప్పలు వాపు, మొక్కలు కాల్చిన వచ్చే వాసన వల్ల ఉబ్బసం వస్తుంది. చిన్న పిల్లలు, వృద్ధులపై త్వరగా ప్రభావం చూపుతుంది.

సత్వరమే తొలగించాలి...

ఈ మొక్క చాలా ప్రమాదకారి, ప్రజలకు ఈ మొక్క చేసే అపార నష్టంపై అవగాహన కల్పించి నివారణ చర్యలు చేపట్టాలి. వ్యవసాయ పొలాలే కాదు, నగరంలోని మన ఇంటి సమీపంలో కూడా ఎక్కుడ ఖాళీ ఉన్నా వర్షాకాలంలో పెరుగుతుంది. మొక్కను చిరు దశలోనే తొలగించాలి. గతంలో రైతులకు అవగాహన లేక పొలాల మధ్య అలాగే వదిలి వేయడం వల్ల అపార నష్టం జరిగింది.

– డా. బి.పద్మజ, ప్రిన్సిపల్ సైంటిస్టు, కలుపు విభాగం హెడ్, రాజేంద్రనగర్

హక్కులు, వాటా, భాగస్వామ్యం మన హక్కు

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

సుల్తాన్ బజార్, ఆగస్టు 25: హక్కులు, వాటా, భాగస్వామ్యం మన హక్కు అని రాష్ట్ర బీసీ రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మాసబ్ ట్యాంక్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఆడిటోరియంలో ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓబీసీ అడ్వకేట్స్ కన్వెన్షన్‌ను ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి మాట్లాడుతూ, హైకోర్టు, జిల్లాలలో బలహీన వర్గాల సంఖ్య, జ్ఞాన సంపద కలిగిన జుడీషియల్ జడ్జి వస్తేనే ఓబీసీల సంఖ్య చూపెట్టుకోలేని పరిస్థితి ఉందన్నారు. ఓబీసీ అడ్వకేట్స్ అడుగుతున్న ప్రతి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళుతానని అన్నారు. తెలంగాణ ఏర్పాటులో న్యాయవాదుల పాత్ర మరువలేనిదని అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న జయంతి రోజున చెప్పా, ఇప్పుడు చెప్తున్నా సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క నాయకత్వంలో కుల గణన పూర్తి చేస్తామని అన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు బలహీన వర్గాల న్యాయవాదులు ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు ఇస్తేనే జరుగుతుందని అన్నారు. మనం చేసే పోరాటంతో భవిష్యత్ తరాలకు ఫలాలు అందాలన్నారు. ఓబీసీ పార్లమెంట్ కమిటీ మెంబర్‌గా అనేక పోరాటాలు జరిగాయన్నారు. 27 శాతం రిజర్వేషన్లు అమలు చేసే వారు లేరని, క్రిమిలేయర్ తెచ్చి దూరం చేసే పరిస్థితిని తీసుకువచ్చారని అన్నారు. బలహీన వర్గాల దళిత గిరిజనులకు న్యాయ సహాయాన్ని అందించాలని ఆకాక్షించారు. కుల గణనపై పార్లమెంట్‌లో కచ్చితంగా బిల్లు వస్తుందని రాహుల్ గాంధీ తెలిపారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. చట్ట సభల్లో మన ప్రతినిధులు ఉంటేనే మన వాట, హక్కులను సాధించుకోవచ్చని అన్నారు. బలహీన వర్గాల ఐఏఎస్, ఐపీఎస్, జడ్జీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎంతో మంది ఉన్నారని అన్నారు. నారాయణ గురు, రామస్వామి పెరియార్ వంటి వారిని గుర్తు చేసుకుంటూ మన హక్కుల కోసం పోరాడాలన్నారు. బలహీన వర్గాలకు చెందిన ఓబీసీ న్యాయవాదులకు అండగా ఉంటానని అన్నారు.

ఆటోమోటివ్ కియాలో మైలేజ్ ర్యాలీ

సిటీబ్యూరో, ఆగస్టు 25(నమస్తే తెలంగాణ): నగరంలోని ఆటోమోటివ్ షోరూంలో కియా మైలేజ్ ర్యాలీని ఆదివారం నిర్వహించారు. సెల్టోస్ డీజిల్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ వాహనాలను కలిగి ఉన్న 65 మంది వినియోగదారులు ర్యాలీలో పాల్గొన్నారని ఆటోమోటివ్ కియా సంస్థ సీఈఓ చెన్నకేశవ తెలిపారు. నాగోల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ వండర్ లా వరకు కొసాగింది. ఈ కార్యక్రమం ద్వారా కియా వాహనాల మైలేజ్ సామర్థ్యాన్ని పూర్తిగా నిరూపించడానికి ఒక అవకాశమని ఆయన తెలిపారు. ర్యాలీలో అత్యధికంగా 34.8కి.మీ మైలేజ్ రికార్డు సాధించిన విజేతకు రూ.10 వేలు, రెండో స్థానంలో నిలిచిన వ్యక్తికి రూ.5 వేలను బహుమతిగా అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో కియా ఏరియా మేనేజర్ వైభవ్‌తో పాటు షోరూమ్ ప్రతినిధులు, కార్ల వినియోగదారులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌లో సందేహాల నివృత్తికి హెల్ప్ డెస్క్‌లు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటుకు చర్యలు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్

మేడ్చల్, ఆగస్టు 25(నమస్తే తెలంగాణ): ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారుల సందేహాల నివృత్తికి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటుంది. అనుమతి లేని లే అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు మార్గ నిర్దేశం చేయడానికి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంతో పాటు 13 మున్సిపాలిటీలు, ఎంపీడీవో కార్యాలయాలలో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయనున్నారు. ప్రజలకు ఎలాంటి సందేహాలు ఉన్నా ఈ హెల్ప్ డెస్క్‌లను సంప్రదించి నివృత్తి చేసుకునేలా డెస్క్‌లు ఉపయోగపడనున్నాయి. గతంలో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తులను చేసుకున్న వారు అవసరమైన మేరకు డాక్యుమెంట్లు ఇవ్వని పక్షంలో ఇప్పుడు హెల్ప్ డెస్క్‌లలో అందించే వీలును కల్పించారు. అంతేకాక త్వరలోనే ప్రత్యేక యాప్‌ను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఎల్ఎఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనకు జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా పర్యవేక్షణలో కొనసాగనున్నాయి. ఇప్పటికే జిల్లా అధికారులకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పర్యవేక్షణపై దీశా నిర్దేశం చేసిన విషయం తెలిసిందే.

జిల్లాలో భారీ సంఖ్యలో దరఖాస్తులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో భారీ సంఖ్యలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ఉన్న నేపథ్యంలో హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాలలోని జీహెచ్ఎంసీ సర్కిళ్లతో పాటు మున్సిపాలిటీ పరిధి, గ్రామీణ ప్రాంతాలతో కలిపి లక్షా 43 వేల దరఖాస్తులు వచ్చాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2020 ఆగస్టు 26 వ తేదీ వరకు రిజిష్టర్ అయిన అనధికారిక ప్లాట్లు, లే అవుట్లను క్రమబద్ధీకరించేందుకు దరఖాస్తులను స్వీకరించిన విషయం తెలిసిందే. ప్రభుత్వ భూములు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, వక్ఫ్, దేవాదాయ భూములు ఉన్నట్లయితే పరిశీలన అనంతరం, తిరస్కరించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని సరైన ధ్రువ పత్రాలు ఉన్నట్లయితే ఫీజు చెల్లించేలా సంబంధిత దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేస్తారు. దీనికి సంబంధించి జిల్లా అదనపు కలెక్టర్ పర్యవేక్షణలో ప్రత్యేక కమిటీని నియమించారు.

కృష్ణస్వామి జయంతిని ఊరూరా ఘనంగా నిర్వహించాలి

తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డా. చొప్పరి శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్ ముదిరాజ్

హిమాయత్‌నగర్, ఆగస్టు25: బహుజన సమాజ సంస్కర్త, హైదరాబాద్ నగర తొలి మేయర్ కీర్తి శేషులు కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ 131వ జయంత్యుత్సవాలను ఊరూరా వైభవంగా నిర్వహించాలని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. హైదరాబాద్ నగరానికి నక్ష చూపిన కృష్ణస్వామి విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసి ఆయన జయంతి, వర్ధంతులను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. హైదర్‌గూడలోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని మహాసభ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల గంగాధర్ ముదిరాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలేంద్ర ముదిరాజ్, సోషల్ మీడియా ఇన్‌చార్జి తమ్మన బోయిన గోపి ముదిరాజ్‌తో కలిసి చొప్పరి శంకర్ ముదిరాజ్ మాట్లాడారు. వందేండ్ల క్రితమే బహుజనుల సంఘాలు ఉండాలని గుర్తించి ముదిరాజ్ సంఘంతో పాటు మరో పది సంఘాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన మహానీయుడు కృష్ణస్వామిని స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలోని ఏదైనా ఒక యూనివర్సిటీకి కృష్ణస్వామి పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. నేడు (సోమవారం) జూబ్లీ బస్టాండ్ సమీపంలో ఉన్న కృష్ణస్వామి విగ్రహం వద్ద జరిగే జయంతి వేడుకలకు ఎంపీ ఈటల రాజేందర్‌తో ముదిరాజ్ నేతలు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోల్ల కరుణాకర్, జగన్, నర్సింగ్, రాజు పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌ను విజయవంతం చేయాలి

వనస్థలిపురం, ఆగస్టు 25: రంగారెడ్డి జిల్లా రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌ను జయప్రదం చేయాలని జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎమ్వీ రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి గునమోని సత్తయ్య, కోశాధికారి వట్టి శ్రీనులు తెలిపారు. సెప్టెంబర్ 20, 21, 22 తేదీల్లో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు జట్లు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ పోటీల్లో విజేతలను రాబోయే రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్‌నకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. క్రీడాకారులు, జట్లు సరైన వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 15వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. స్పీడ్ విభాగానికి జి.సత్య, హాకీ విభాగానికి వి.శ్రీను, ఆర్టిస్టిక్ విభాగానికి రమ్య మురళి ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తారన్నారు. వివరాలకు ఫోన్ 95429 19225, 96669 79220లో సంప్రదించాలన్నారు.

ఫార్మా కంపెనీకి పంట భూములివ్వం

- సీఎం రేవంత్‌రెడ్డి మా రైతుల జోలికి రావొద్దు
- మా భూములు ఇవ్వం..
- ఫార్మా కంపెనీ వ్యతిరేక పోరాట సమితి ప్రతినిధులు

సమావేశంలో మాట్లాడుతున్న ఫార్మా కంపెనీ వ్యతిరేక పోరాట సమితి ప్రతినిధులు

రవీంద్రభారతి, ఆగస్టు 25: వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండల పరిధిలోని పంట భూముల్లో ఫార్మా కంపెనీని ఏర్పాటు చేయెద్దని ఫార్మా కంపెనీ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. తమకు జీవనాధారమైన పచ్చిన పంట భూములను ఫార్మా కంపెనీకి ఇవ్వబోమని సమితి ప్రతినిధులు, రైతులు బోగమోని సురేశ్ రాజు, మాగం యాదయ్య, చాకాలి శ్రీకాంత్, సామలి శ్రీశైలం స్పష్టం చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, దుద్యాల మండలంలోని లగచర్ల, హకీంపేట్, పోతేపల్లి, ఆర్బీ తండా, పులిచెర్ల కుంట తండా, ఈర్లపల్లి తండా గ్రామాలకు చెందిన 1100 మంది చిన్న, సన్నకారు రైతులు చెందిన 1375 ఎకరాల పంటభూములు రాష్ట్ర ప్రభుత్వం ఫార్మా కంపెనీ కోసం సేకరించేందుకు సిద్ధమైందని తెలిపారు. అభివృద్ధి పేరిట తమ భూములను లాక్కోవాలని చూస్తే ఊరుకోబోమని సీఎం రేవంత్‌రెడ్డికి హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి మొండికేసి ఫార్మా కంపెనీలు తీసుకువస్తే తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ప్రభుత్వ వైఖరిలో మార్పు రాకుంటే ఢిల్లీలోని కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఇంటి ముందు ధర్నాలు, నిరసనలు చేస్తామని, హైకోర్టును కూడా ఆశ్రయించేందుకు సిద్ధంగా ఉన్నామని వారు పేర్కొన్నారు.

ఎన్ఎండీసీ ఆధ్వర్యంలో మారథాన్

మారథాన్‌ను ప్రారంభిస్తున్న సీపీ శ్రీనివాస్ రెడ్డి

ఖైరతాబాద్, ఆగస్టు 25: నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వద్ద ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్ ఉత్సాహంగా సాగింది. ఎలైట్, హాఫ్, ఫుల్ మారథాన్‌ను ముఖ్య అతిథిగా హాజరైన నగర సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి, ఎన్ఎండీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జయపాల్ రెడ్డి, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ నారాయణ టీవీ, రేస్ డైరెక్టర్ రాజేశ్ వేచ్ఛతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ రన్ పీపుల్స్ ప్లాజా నుంచి ఖైరతాబాద్ ఫ్లై ఓవర్, రాజ్ భవన్ రోడ్, జూబ్లీహిల్స్ మీదుగా గచ్చిబౌలి వరకు సాగింది. సీపీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దైనందిన జీవితంలో యువత సరైన వ్యాయామం లేక, కల్తీ, జంక్ ఫుడ్ తీసుకుంటూ అనారోగ్యాల పాలవుతున్నారని అన్నారు. 60 నుంచి 70 ఏండ్ల వయస్సులో రావాల్సిన జబ్బులు 20 ఏండ్లకే వస్తున్నాయన్నారు. ఇలాంటి రన్‌లు ప్రతి ఒక్కరికి స్ఫూర్తి కావాలన్నారు.

ఘనంగా తీజ్ వేడుక

మియాపూర్ డివిజన్ నగిగడ్డ తండాలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో తీజ్ వేడుక ఆదివారం భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. గిరిజనులు అధిక సంఖ్యలో ఈ వేడుకలకు హాజరయ్యారు. సంప్రదాయ వస్త్ర ధారణతో నవ ధాన్యాలు వేసిన పంచ పాలికలతో గిరిజన మహిళలు ప్రదర్శన నిర్వహించి భగవంతునికి సమర్పించారు. చిన్నారులు ఎంతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. గిరిజన సంఘం జాతీయ నాయకుడు మోహన్ నాయక్ సహా స్థానిక గిరిజన సంఘం నేతలు, మహిళలు పాల్గొన్నారు.

– మియాపూర్, ఆగస్టు 25

జీవిత సత్యాల అక్షర రూపమే.. అమ్మ మాట

ఆచార్య డాక్టర్ టి.గౌరీ శంకర్

పెంజర్ల లక్ష్మీనర్సమ్మ రచించిన అమ్మ మాట పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య డాక్టర్ టి.గౌరీ శంకర్, తెలంగాణ సాహిత్య అకాడమీ సెక్రటరీ డాక్టర్ బాలాచారి నామోజు తదితరులు

సైదాబాద్, ఆగస్టు 25: విశ్వహిత ఫౌండేషన్, వైదేహి ఆశ్రమం సంయుక్త ఆధ్వర్యంలో పెంజర్ల లక్ష్మీనర్సమ్మ రచించిన అమ్మ మాట (అణిముత్యాలైన తెలుగు సూక్తులు) పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం సాయంత్రం సైదాబాద్‌లోని వైదేహి ఆశ్రమం ఆవరణలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్వబ్రాహ్మణ ధర్మ పీఠం సభాపతి ఆచార్య డాక్టర్ టి.గౌరీ శంకర్ హాజరై అమ్మమాట పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేడు ఆవిష్కరించినటువంటి పుస్తకం నవల, కథ, కవిత్వం, నాటకం కాదు.. అది ఒక జీవితానికి సంబంధించిన అంశాలను పొందుపర్చిన మనమంతా చదవాల్సిన జీవిత పుస్తకమన్నారు. మనలో ఆత్మస్థైర్యాన్ని పొందించుకోవటానికి, మనిషి మనిషిగా జీవించటానికి తన జీవితంలో లక్ష్య సాధన సాధించటానికి ముందడుగు వేయటానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. రచయిత లక్ష్మినర్సమ్మ తన నిజ జీవితంలో జరిగినటువంటి అంశాలను క్రోఢీకరించి అక్షర రూపంలో అందించిన అమ్మమాట పుస్తకం మనమందరం చదవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తెలంగాణ సాహిత్య అకాడమి సెక్రటరీ డాక్టర్ బాలాచారి నామోజు మాట్లాడుతూ సమాజంలో విలువలను పెంపొందించటానికి అవసరమైన సాహిత్యాన్ని ప్రోత్సహించాల్సిన అవసరముందన్నారు. రచయిత్రి నర్సమ్మ మాట్లాడుతూ, తన రచనల నేపథ్య మూలాలను సువివరంగా వివరించారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ డాక్టర్ సి.వీరేందర్, ఎస్ఐఈటీ ప్రొఫెసర్ డాక్టర్ కె.రవికాంతారావు, ఎస్ఐఈటీ డైరెక్టర్ విజయలక్ష్మిబాయి, వైదేహి సేవా సమితి అధ్యక్షులు సురేందర్ రెడ్డి, వైదేహి సేవా సమితి అధ్యక్షులు సీతాకుమారి, కవి, రచయిత డాక్టర్ విజయ్‌భాస్కర్, రచయిత్రి నర్సమ్మ కుమారులు సురేశ్, రమేశ్, గోపాల్, వినోద్, విశ్వహిత ఫౌండేషన్ కాసవజ్జుల రామశర్మ, ప్రధాన కార్యదర్శి రమేశ్ కుమార్ మర్రి, వినోద్, రమేశ్, జీవీఎస్ రాజు, డాక్టర్ శ్రీచందన పాల్గొన్నారు.

ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో..

బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. రెవెన్యూ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి నేతృత్వంలో తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సీపీఎస్ పెన్షన్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘాల నేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సాగర్ చుట్టూ కబ్జాలే..

- హైడ్రా వాటిపై దృష్టి సారించాలి
- సామాజికవేత్త లుబ్నా సర్వత్

ఖైరతాబాద్, ఆగస్టు 25: హుస్సేన్ సాగర్ ఒకప్పుడు తాగునీటి వనరుగా ఉండేదని, రిజర్వాయర్‌గా పిలవబడేదని, కాని కాలక్రమేణా అది కాలుష్య కారకంగా మారడంతో పాటు కబ్జాల పాలైందని సామాజికవేత్త లుబ్నా సర్వత్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, హుస్సేన్ సాగర్ గతంలో మూడువేల ఎకరాల్లో విస్తరించి ఉండేదని, కాలక్రమేణ అది వెయ్యి ఎకరాల్లో మాత్రమే ఉందని అధికారులు చెబుతున్నారన్నారు. సాగర్ చుట్టూ అనేక నిర్మాణాలను చేపట్టారని, హైడ్రా దానిపై దృష్టి సారించాలన్న